క్లుప్తంగా

సేవాలాల్ మహరాజ్ గొప్ప మార్గదర్శకుడు

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, తదితరులు

కొత్తూరు: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ సమాజానికి గొప్ప మార్గ దర్శకుడని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లాపూర్ గుడితండాలో ఆదివారం నిర్వహించిన సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం, దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్థానిక గిరిజన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీతో పాటు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, రవి నాయక్, దయానంద్‌గుప్తా, దశరథ్‌నాయక్, నర్సింహారెడ్డి, మోదీ దర్శన్, మల్లేశ్, జయేందర్‌రెడ్డి, శ్రీరాములు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నెంటూరి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. భీంభరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పరిధిలోని హైతాబాద్‌లో ఎర్రోనిగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మల్లారెడ్డి, సామ ప్రశాంత్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



చేవెళ్ల: ఎన్నికల సామగ్రి తీసుకుంటున్న సిబ్బంది

- నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- సామగ్రి పంపిణీ చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో 2,69,960 మంది ఓటర్లు
- షాద్‌నగర్ పరిధిలో 2,38,478 మంది

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి అసెంబ్లీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి, సిబ్బందిని పంపించారు. నియోజకవర్గ పరిధిలోని నవాబుపేట, శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్ మండలాల్లో మొత్తం 298 పోలింగ్ కేంద్రాలు 26 సెక్టార్ రూట్స్, 52 బస్సులు, 2500ల మంది సిబ్బంది ఎన్నికల్లో విధులు నిర్వహించనున్నారు. ఈ ఐదు మండలాలకు సంబంధించి తుది ఓటరు జాబితా ప్రకారం 2,69,960 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ గ్రామంలో యూత్ పోలింగ్ కేంద్రం (పీఎస్. నెం.145)ని ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద, రెండు లేదా అంతకంటే ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ ద్వారా సహాయ ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి పోలింగ్ సరళిని పరిశీలిస్తారని సాయిరాం తెలిపారు.

చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో 2176 పోస్టల్ ఓట్లు, 312 హోం ఓటింగ్

ఎన్నికల విధుల్లో ఉంటున్న వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగుల మొత్తం 2176 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన హోం ఓటింగ్ ద్వారా 312 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు.

షాద్‌నగర్: ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధం అయ్యారు. అధికారులు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం షాద్‌నగర్ నియోజకవర్గంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. ఈ నియోజకవర్గంలోని కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో మొత్తం 263 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే ఇందులో 91 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా పోలీసు అధికారులు గుర్తించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మంచినీరు వసతి కల్పించడంతో పాటుగా దివ్యాంగులకు, వృద్ధుకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశారు. మొత్తం 2,38,478 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు పట్టణంలోని మినీ స్టేడియంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వెంకట మాధవ రావు ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి అధికారులు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికల సామగ్రిని తీసుకున్న సిబ్బంది వారికి కేటాయించిన ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. సామగ్రి పంపిణీ వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.

ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

మొయినాబాద్: లోక్‌సభ ఎన్నికల ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం సాయంత్రమే అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఐదు రూట్లలో మొయినాబాద్ మండలంలోని 65 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది వచ్చారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది సోమవారం ఉదయం జరిగే పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వెబ్‌కాస్టింగ్ కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు పోలీసులు, పారామిలటరీ బలగాలు చేరుకున్నాయి.



మొయినాబాద్: పనిలో నిమగ్నమైన సిబ్బంది



షాద్‌నగర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న ఆర్డీఓ వెంకట మాధవరావు



చేవెళ్ల: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఉద్యోగులు

యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ముస్తాబు



అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎత్‌మార్‌పల్లి గ్రామాల్లో అధికారులు యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి ముస్తాబు చేశారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ఆకర్షించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద స్వాగత బోర్డులతో పాటు పచ్చని మామిడి తోరణాలు, పూలమాలలు వేసి బెలూన్‌లతో ముస్తాబు చేశారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్, హిమాయత్‌నగర్‌లో సంధ్య, ఎత్‌మార్‌పల్లిలో శివ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను ఓటర్లు ఆకర్షించే విధంగా తయారుచేశారు. అధికారుల సూచనల మేరకు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కార్యదర్శులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొయినాబాద్: ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని నాగిరెడ్డిగూడ, చిలుకూరు, చందానగర్, పెద్దమంగళారం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన యూత్ మోడల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



చిలుకూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

తల్లి ప్రేమ అమూల్యమైనది

ఎల్‌ఎఫ్ ఆరోగ్య యోగా సెంటర్ చైర్‌పర్సన్ భారతి

మొయినాబాద్‌రూరల్: లోకంలో అత్యంత అమూల్యమైనది తల్లి ప్రేమ అని ఎల్‌ఎఫ్ ఆరోగ్య యోగా సెంటర్ చైర్‌పర్సన్ భారతి అన్నారు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా అజీజ్‌నగర్‌లో గల యోగా సెంటర్‌లో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కన్నబిడ్డల భవిష్యత్ కోసం నిత్యం శ్రమిస్తూ వారి కళ్లల్లో ఆనందాన్ని చూసేదే తల్లి అన్నారు. అనంతరం యోగా కేంద్రంలో కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస్, సభ్యులు సుధాకర్, లక్ష్మిప్రసన్న, శ్రవంతి, భవ్య, వరలక్ష్మి, వీరాచారి, అమ్డాపూర్ నాగేశ్, మాణిక్యం, బంగాలిగూడ అశోక్, వివిధ గ్రామాల మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.